
16 నుంచి రెవెన్యూ సదస్సులు

కలెక్టరేట్, ఆగస్టు 11: గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 16 నుంచి సెప్టెంబరు 30 వరకూ రెవెన్యూ సదస్సులు జరగనున్నాయి. ఈ సదస్సులకు జాయింట్ కలెక్టరు సమన్వయ కర్తగా ఉంటారు. మండల స్థాయి అధికారులు బృందాలుగా ఏర్పడి సదస్సులు నిర్వహిస్తారు. ఈ బృందంలో తహసీల్దారు, ఆర్ఐ, రెవెన్యూ అధికారి, మండల సర్వేయర్, దేవదాయ, వక్ఫ్, రిజిస్ట్రేషన్, అటవీశాఖ సిబ్బంది ఉంటారు. అవసరమైన చోట పోలీసు బందో బస్తు ఏర్పాటు చేస్తారు. ప్రతిరోజు ఉదయం 9గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది. రైతుల నుంచి స్వీకరించిన వినతులకు వెంటనే రశీదు అందజేస్తారు.

చదువు కోసం సాహసం

- తెప్పపై పాఠశాలకు వెళ్తున్న చిన్నారులు
- ప్రమాదకరంగా జలాశయం దాటుతున్న వైనం
- ఏడాదిలో ఆరునెలలు ఇదే పరిస్థితి
- మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు


తెప్పపై పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు


రేషన్ కోసం తెప్పపై వెళ్తున్న దోనిబిల్లి గ్రామస్థులు

చదువు కోసం ఆ మూడు గ్రామాల పిల్లలు నిత్యం సాహసం చేస్తుంటారు. ప్రాణాలను పణంగా పెట్టి తెప్పపై ప్రమాదకరంగా జలాశయం దాటి పాఠశాలకు వెళ్తుంటారు. ఏడాదిలో ఆరు నెలలు ఇదే పరిస్థితి. మిగతా ఆరు నెలలు బురదలో నడుచుకుంటూ బడికి వెళ్తుంటారు. దీంతో వారికి ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు నిత్యం ఆందోళన చెందుతుంటారు. పింఛన్లు, రేషన్ తీసుకునేందుకు కూడా ఆ మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇదీ కొండపర్తి బాడవ, పోరపు బాడవ, దోనిబిల్లి గ్రామస్థుల పరిస్థితి.

(మెంటాడ)

మండలంలోని లోతుగెడ్డ పంచాయతీ పరిధిలో కొండపర్తి బాడవ, పోరపు బాడవ, దోనిబిల్లి గ్రామాలు ఉన్నాయి. ఈ మూడు గ్రామాల్లో వంద మంది జనాభా నివసిస్తున్నారు. బడికి వెళ్లే చిన్నారులు తొమ్మిది మంది ఉన్నారు. ఈ మూడు గ్రామాలూ ఆంధ్ర జలాశయానికి ఆవలవైపు ఉన్నాయి. దీంతో విద్యార్థులు చదువుకోవడానికి జలాశయానికి ఇవతలవైపు ఉన్న కొండపర్తి పాఠశాలకు ప్రతిరోజూ వెళ్లివస్తుంటారు. వేసవిలో వారికి అంతగా ఇబ్బందులు ఉండవుగానీ, వర్షా కాలం మొదలైతే మాత్రం అవస్థలు తప్పవు. థర్మాకోల్ షీట్లను తెప్పలుగా చేసుకొని దానిపై కూర్చొని నడుపుకుంటూ జలాశయం దాటి కొండపర్తి పాఠశాలకు వెళ్లి వస్తుంటారు. ఈ సమయంలో వారివెంట తల్లిదండ్రులు గానీ ఇతరులు గానీ ఉంటారు. కొన్నిసార్లు ఎవరూ లేని సమయంలో విద్యార్థులే తెప్పను నడుపుతుంటారు. ప్రతిరోజూ సుమారు 25 మీటర్ల లోతున్న జలాశయం నీటిలో దాదాపు 30 మీటర్ల ప్రయాణం చేస్తుంటారు. కొత్తగా చూసేవారికి పిల్లలు నదీ విహారం చేస్తున్నారని అనిపిస్తుంది. కానీ, అసలు విషయం తెలిశాక వెన్నులో వణుకు పుట్టడం ఖాయం. జలాశయం గుండా కాకుండా వేరే మార్గం ఒకటి ఉంది. అరకు జిల్లా అనంతగిరి మండలం గరుగుబిల్లి మీదుగా కొండపర్తికి చేరుకోవచ్చు. కానీ, ఇది చాలా వ్యయప్రయాసతో కూడుకున్నది. దీంతో తప్పనిసరి స్థితిలో ప్రాణాలను పణంగా పెట్టి జలశయాన్ని దాటుతున్నారు. ఏడాదిలో ఆరునెలలు ఇదే పరిస్థితి. జలాశయంలో నీటిమట్టం తగ్గాక వారికి కొత్త సమస్య తలెత్తుతుంది. నీటి అడుగున పేరుకుపోయిన బురద ఊబిలా తయారై విద్యార్థులు, తల్లిదండ్రులను మరింత భయపెడుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను భుజాలపై వేసుకొని దాటిస్తుంటారు. అక్కడ నుంచి విద్యార్థులు నడిచి పాఠశాలకు వెళ్తుంటారు. తిరుగు ప్రయాణంలో పెద్దలు లేకపోతే పిల్లలే సాహసం చేసి ముందుకు సాగుతుంటారు. ఈ క్రమంలో ఏ ప్రమాదం వాటిల్లుతుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో కొందరు పిల్లలు బడికి దూరం అవుతున్నారు. కాగా, గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ చిన్నారులకు రవాణా ఖర్చులు నిమిత్తం ఏడాదికి రూ.5వేలు వరకు తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమచేసేది. వైసీపీ వచ్చాక ఎగనామం పెట్టింది. ఇదిలాఉండగా, రేషన్, పింఛన్లు తీసుకోవడానికి కూడా కొండపర్తికి వెళ్లేందుకు ఈ మూడు గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కష్టాల నుంచి తమను కూటమి ప్రభుత్వం గట్టెక్కించాలని కోరుతున్నారు.

రవాణా ఖర్చులు ఇవ్వడం లేదు..

దోనిబిల్లి, కొండపర్తిబాడవ, పోరపు బాడవ నుంచి తొమ్మిది మంది విద్యార్థులు పాఠశాలకు వస్తున్నారు. వేసవిలో కొంతమేరకు నడకదారి పరవాలేదు. వర్షాలు కురిసి జలాశయం పొంగితే ప్రమాదకరమైన పరిస్థితిలో తెప్పలపై రాకపోకలు సాగిస్తారు. విద్యార్థులను తెప్పలు నడపవద్దని చెప్పా. ఇప్పుడు నడకదారి ఊబిగా తయారైంది. పెద్దల సాయంతో నదిదాటి పాఠశాలకు వస్తున్నారు. విద్యార్థులకు రవాణా ఖర్చులు గతంలో వచ్చేవి. కొన్నేళ్లుగా ఇవ్వడం లేదు.

-నరసింగరావు, ప్రధానోపాధ్యాయుడు, కొండపర్తి పాఠశాల

ఆ గ్రామస్థులకు ఏ అవసరం వచ్చినా పడవ ఎక్కాల్సిందే. వంతెన లేకపోవడంతో ప్రమాదకరంగా పడవలో ప్రయాణించి నది అవతల ఉన్న గ్రామం చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. వంతెన కల ఏళ్లుగా నెరవేరడం లేదు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ కొత్తూరు గ్రామస్థుల పరిస్థితి. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఊరు దాటాలంటే.. పడవ ఎక్కాల్సిందే!

- నదిపై ప్రమాదకర ప్రయాణం
- ఏళ్లు గడుస్తున్నా తీరని వంతెన సమస్య
- ఇబ్బందులు పడుతున్న కొత్తూరు గ్రామస్థులు


తెప్పపై నది మీద రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

(భోగాపురం)

మండలంలోని ముక్కాం పంచాయతీ కొత్తూరు (బోడిపల్లి పేట)లో సుమారు 250 గృహాలు ఉన్నాయి. సుమారు 700 మంది జనాభా ఉన్నారు. వీరిలో అధిక శాతం మత్స్యకారులే. వీరంతా సముద్రంపై చేపల వేట సాగిస్తూ జీవనాధారం పొందుతుంటారు. గ్రామంలో ప్రాథమిక పాఠ శాల ఉండగా పక్క గ్రామం రామచంద్రపేటలో హైస్కూల్ ఉంది. ఇక్కడ కొంతమంది విద్యార్థులు చదువుతుండగా మరికొంతమంది పూసపాటిరేగ మండలం కోనాడ పాఠశాలలో చదువుతున్నారు. అయితే, కొత్తూరు గ్రామం నుంచి ముక్కాం ఆర్అండ్‌బీ రహదారికి సుమారు మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీంతో గ్రామస్థులు ముక్కాం వైపు వెళ్లరు. ఈ గ్రామానికి పూసపాటిరేగ మండలం కోనాడ గ్రామానికి సుమారు కిలోమీటరు దూరం మాత్రమే ఉంటుంది. రెండు గ్రామాల మధ్య సుమారు 150 నుంచి 200 మీటర్ల వెడల్పుతో చంపావతి నది మాత్రమే ఉంది. దీంతో ఏ చిన్న అవసరం వచ్చినా పడవలో నదిని దాటి కోనాడ చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సులు, ఆటోల్లో జిల్లా కేంద్రం విజయనగరం, తదితర ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు, మార్కెట్లకు వెళ్తుంటారు. పడవలో కోనాడ గ్రామానికి వెళ్లి రావాలంటే విద్యార్థులకు రానుపోను రూ.10, పెద్దవారికి రూ.20 తీసుకుంటారు. నదిపై ప్రతిరోజూ వేకువ జాము నుంచి రాత్రి సమయం వరకు పడవల్లో నిరంతరం తిరుగుతుంటారు. ఒక్కోసారి వరదల సమ యంలో నది ప్రమాదకరంగా మారుతుంది. అయినా గత్యంతరంలేక ప్రయాణం చేస్తుంటామని కొత్తూరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి కొత్తూరు-కోనాడ మధ్యలో నదిపై వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

వంతెన నిర్మించాలి..

మా గ్రామం నుంచి కోనాడ వెళ్లేందుకు నదిని దాటాల్సిందే. మా పిల్లలు చదువుకునేందుకు ప్రతిరోజూ తెప్పపై నదిని దాటి కోనాడ వెళ్తుంటారు. అక్కడ బస్సు ఎక్కి విజయనగరం వెళ్తుంటారు. ప్రతీ అవసరానికి నది దాటి వెళ్లాల్సిందే. వరదల సమయంలో కూడా తప్పడం లేదు. ప్రభుత్వం స్పందించి వంతెన నిర్మించాలి.

-మేడ పోలమ్మ, కొత్తూరు

చేపలు అమ్ముకోవడానికి వెళ్తుంటా..

నేను చేపలు అమ్ముకోవడానికి నిత్యం పడవపై నదిని దాటి కోనాడ వెళ్తుంటా. ఉదయం నుంచి రాత్రి వరకు పడవ ఉంటుంది. రానుపోను చిన్నోళ్లకు రూ.10, పెద్దోళ్లకు రూ.20 తీసుకుంటారు. ఇక్కడ వంతెన నిర్మిస్తే అన్నివిధాలా బాగుంటుంది.

-ఎరుపల్లి తోటమ్మ, కొత్తూరు

పూర్వం నుంచి ఇంతే..

మాకు కోనాడ దగ్గరగా ఉంటుంది. అక్కడ నుంచి వేరే ప్రాంతాలకు వెళ్లేందుకు బస్సులు, ప్రైవేట్ వాహనాల సౌకర్యం ఉంటుంది. అందుకే నదిని దాటి కోనాడకు వెళ్తుంటాం. వంతెన లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఏళ్లు గడుస్తున్నా మా తలరాతలు మారడంలేదు.

-ఎరుపల్లి తవిటయ్య, మత్స్యకారుడు, కొత్తూరు

4 సెంట్లలో సిరులు

- 9 రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు
- వీటిని ఉచితంగా పంచుతున్న వైనం
- ఆదర్శంగా మెట్టవలస మహిళ


కూరగాయల పొలంలో లక్ష్మి, కృష్ణ దంపతులు


బెండ, చిక్కుడు పాదులు

బొబ్బిలి, ఆగస్టు 11: మెట్టవలస గ్రామానికి చెందిన కోట లక్ష్మి నాలుగు సెంట్ల భూమిలో తొమ్మిది రకాల కూరగాయలు, ఆకుకూరలను సాగు చేస్తోంది. ఈ కూరగాయలను విక్రయించకుండా ఇతరులకు ఉచితంగా పంపిణీ చేస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. లక్ష్మి భర్త కృష్ణ బొబ్బిలి గ్రోత్ సెంటరులో వాచ్‌మన్‌గా పనిచేస్తున్నాడు. తాను పనిచేస్తున్న చిన్న పరిశ్రమను ఆనుకొని నాలుగు సెంట్ల భూమి ఖాళీగా ఉంది. ఆ భూమిలో కృష్ణ భార్య లక్ష్మి- కాకర, బెండ, చిక్కుడు, కాటా చిక్కుడు, వంగ, బీర, గుమ్మడి, తోటకూర, గోంగూర పంటలను సాగు చేస్తోంది. అలాగే, అరటి, పనస, మామిడి, నేరేడు చెట్లను పెంచుతోంది. యజమానికి చెందిన పశువులను కూడా దంపతులు పోషిస్తున్నారు. వాటి ద్వారా వచ్చిన పశువుల గెత్తాన్ని ఎరువుగా వినియోగిస్తున్నారు. ఎటువంటి రసాయన ఎరువులను వాడకుండా పశువులగెత్తంతోనే ఆరోగ్యకరమైన కూరగాయలను పండిస్తున్నారు.

కూరగాయలు తీసుకెళతాం..

ప్రతీ వారం ఒక్కో కార్మికుడు సుమారు రెండు నుంచి మూడొందల రూపాయల విలువ చేసే కూరగాయలను ఇంటికి తీసుకెళ్తాడు. పశువుల గెత్తం (ఎరువు)తో పండిస్తున్న కూరగాయలు కావడంతో మంచి నాణ్యతగా ఉంటాయి. వీటి రుచి కూడా బాగుంటుంది.

-రమేష్, కార్మికుడు

ఏడు కుటుంబాలకు పంచుతాం..



మా కుల వృత్తి కూరగాయలను పండించడం. మాకు తెలిసిన విద్య అదొక్కటే. ఏడాదిలో వేసవి కాలంలో మూడు నెలలు తప్పించి మిగిలిన అన్ని రోజుల్లో సుమారు ఎనిమిది నుంచి పది రకాల కూరగాయలు, ఆకుకూరలను ఇక్కడ పండిస్తాం. సీజన్‌కు రూ.10వేల చొప్పున రెండు సీజన్లలో కలిపి సుమారు రూ.20 వేల విలువ చేసే పంట వస్తుంది. పండిన కూరగాయలను అమ్మబోము. విశాఖపట్నంలో ఉన్న మా యజమానికి, యూనిట్‌లో పనిచేసే ఉద్యోగులు, కార్మిక కుటుంబాలకు పంచుతాం. చిన్న కమతంలో రోజంతా కష్టపడి ఫలసాయం పొందడం ఎంతో ఆనందంగా ఉంటుంది.

-కోట లక్ష్మి

ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతాయి

- జూన్ 2026 నాటికి నిర్మాణం పూర్తి చేస్తాం
- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు


విమానాశ్రయ పనులపై అధికారులతో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం, ఆగస్టు 11: భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతాయని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఎయిర్ పోర్టు పనులను మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం మాధవితో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. టెర్మినల్ భవనం, రన్‌వే, ఏటీసీ టవర్, తదితర పనులను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వీటిపై జిల్లా అధికారులు, జీఎంఆర్, ఎల్అండ్‌టీ ప్రతినిధులతో కొంతసేపు సమీ క్షించారు. అనంతరం విలేకరుల సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ మాట్లాడారు. 'విమానాశ్రయం పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. 2026 జూన్ నాటికి పూర్తి చేస్తాం. ఉత్తరాంధ్ర రూపురేఖలు మార్చే ఈ విమానాశ్రయాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. ఈ ప్రాంతంలో కూటమి పార్టీలకు అఖండ మెజార్టీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకొనే బాధ్యత మాపై ఉంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనలు, సలహాలతో ధైర్యంగా ఎయిర్ పోర్టు పనులు చేస్తున్నాం. పూర్తయ్యే వరకూ ప్రతీ నెల పరిశీలించి సమీక్షిస్తుంటా. గత నెలకు ఇప్పటికి పనుల్లో వేగవంతం పెరిగింది. గతంలో వచ్చిన పుడు 31.8 శాతం పనులు జరిగాయి. ప్రస్తుతం 36.6 శాతం పూర్తయ్యాయి. రన్‌వే, టెర్మినల్, భవనాలు, ఇతరత్రా అన్నింటిలో పురోగతి కనిపిస్తుంది. గత నెలలో అధికంగా వర్షాలు పడినా పనులు ఆపలేదు. దేశంలో విమానాయాన రంగం ఏటా 16శాతం వృద్ధి సాధిస్తుంది. దేశ వ్యాప్తంగా విమానాశ్రయాలు ఏర్పాటు చేయా లంటూ డిమాండ్ పెరుగుతుంది. శ్రీకాకుళం జిల్లా మూలపేట, దగదర్తి, నాగార్జునసాగర్, కుప్పంలో విమా నాశ్రయాల ఏర్పాటుకు సన్నహాలు జరుగుతున్నాయి. అనంతపురం, ఒంగోలులో కూడా ఏర్పాటుకు అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అనువైన, అవసరమైన స్థలాలు ఉంటే ఏర్పాటు చేస్తాం. ముంబాయి సమీపం లోని నవీముంబై, నొయిడా సమీపంలో జీవన్ ఎయిర్ పోర్టులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తాం. గత వైసీపీ ప్రభుత్వం విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించింది. జోన్‌కు అవసరమైన స్థలాలను అప్పగించలేదు. ప్రస్తుతం రైల్వే జోన్ కోసం సుమారు 5.25 ఎకరాల భూమిని, అవసర మైన ఇతర అనుమతులను కూడా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడారు. విశాఖ నుంచి ఇక్కడ ఎయిర్‌పోర్టుకి అధికంగా ప్రయాణికులు వచ్చే అవకాశం ఉంది. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా 12 చోట్ల మార్పులు చేయాల్సి ఉంది. దీనికి సంబంధించి హైవే, ఆర్అండ్‌బీ అధికారులతో మాట్లాడుతాం. బీచ్‌రోడ్ కూడా ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తాం. డెంకాడ టోల్‌ప్లాజా సమస్య నాదృష్టికి వచ్చింది. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తాం.' అని తెలిపారు. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, కలెక్టర్ డా.బి.ఆర్. అంబేడ్కర్, ఆర్డీవో ఎంవీ సూర్యకళ, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, పార్టీ మండల అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ, నాయకులు కంది చంద్రశేఖర్, పతివాడ తమ్మునాయుడు, జీఎంఆర్ సంస్థ డిప్యూటీ ఎండీ ఐ.ప్రభాకరరావు, సీఈవో మన్మోయ్‌రాయ్, ప్రాజెక్టు హెడ్ రామరాజు, తహసీల్దార్ ఎం.సురేష్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వదిలేశారు

- వైసీపీ పాలనలో పూర్తికాని సచివాలయ నిర్మాణాలు
- ఆర్బీకేలు, వెల్నెస్ కేంద్రాలు కూడా..
- డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కేంద్రాల ఊసేలేదు


విజయనగరం మండలం గుంకలాంలో అసంపూర్తిగా ఆర్బీకే భవనం

విజయనగరం (ఆంధ్రజ్యోతి) ఆగస్టు 11: జిల్లాలో సచివాలయాల నిర్మాణాన్ని గత వైసీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసింది. రైతుభరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లు, డిజిటల్ లైబ్రరీలు, బల్క్‌మిల్క్ కేంద్రాల పరిస్థితి కూడా ఇంతే. ఏ పనులు కూడా పూర్తి చేయలేదు. చాలా భవనాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. జిల్లాలో 530 గ్రామ సచివాలయాలు, 496 రైతు భరోసా కేంద్రాలు, 435 వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలకు గాను గత ప్రభుత్వ హయాంలో అధికారులు రూ.453.18 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలు పంపించారు. వీటికి జగన్ సర్కారు ఆమోదం తెలపడంతో పనులు ప్రారంభించారు. ఒక్కో సచివాలయ భవన నిర్మాణానికి రూ.25 లక్షల నుంచి రూ.40 లక్షలు, ఆర్బీకేలకు రూ.23.98 లక్షలు, వెల్‌నెస్ కేంద్రాలకు రూ.21.8 లక్షల చొప్పున మంజూరు చేసింది. వైసీపీ ఐదేళ్ల అధికారం పూర్తయినా వీటి నిర్మాణాలు పూర్తి చేయలేకపోయింది. 70 శాతం బిల్లులు చెల్లింపులు మాత్రం జరిగాయి. ఈ పనుల కాంట్రాక్టులన్నీ వైసీపీ నేతలు, కార్యకర్తలు, సర్పంచ్‌లు చేపట్టి జేబులు నింపుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

- 530 గ్రామ సచివాలయాలకు గాను 151 భవన నిర్మాణాలు చేపట్టలేదు. 121 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 32 పనులకు శంకుస్థాపనలు నిర్వహించలేదు. కేవలం 226 భవనాలను పూర్తిచేశారు. ఈ పనులకు రూ.208.42 కోట్లు మంజూరు కాగా, రూ .161.76 కోట్లను బిల్లుల రూపంలో చెల్లించారు. కొన్ని చోట్ల పనులు ప్రారంభించకుండానే బిల్లులు చెల్లించినట్లు ఆరోపణలు ఉన్నాయి.
- 496 ఆర్బీకేల నిర్మాణానికి రూ.118.74 కోట్లు మంజూరయ్యాయి. ఐదేళ్లలో కేవలం 293 నిర్మాణాలే జగన్ సర్కారు పూర్తి చేసింది. 124 భవనాల పనులను అసంపూర్తిగా వదిలేశారు. 79 భవనాలు ప్రారంభానికే నోచుకోలేదు. అయినా రూ.80.32 కోట్ల బిల్లులు చెల్లించేశారు.
- వెల్‌నెస్ కేంద్రాల నిర్మాణాలను కూడా జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. 435 కేంద్రాల నిర్మాణానికి రూ.90.48 కోట్లు మంజూరు చేసింది. 183 కేంద్రాలనే నిర్మించింది. 128 కేంద్రాలు వివిధ దశల్లో ఉన్నాయి. 124 కేంద్రాల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రూ.50.20 కోట్ల బిల్లులు చెల్లింపులు చేశారు.
- జిల్లా వ్యాప్తంగా 173 డిజిటల్ లైబ్రరీల నిర్మాణానికి రూ.27.68 కోట్లు మంజూరయ్యాయి. కేవలం చీపురుపల్లిలో నిర్మాణం పూర్తిచేసుకోగా, మరో మూడు చోట్ల వివిధ దశల్లో ఆగిపోయాయి. 169 చోట్ల పనులు ప్రారంభమే కాలేదు. అదేవిధంగా 50 చోట్ల బల్క్‌మిల్క్ కేంద్రాలను హడావుడిగా మంజూరు చేసి కొన్నిచోట్ల నిర్మాణాలు చేపట్టారు. వీటిలో కొత్తవలసలో నిర్మాణం పూర్తి చేసుకోగా 4 చోట్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటికి రూ.1.72 కోట్ల బిల్లులు చెల్లించారు.

ఎప్పుడూ లేనిది సార్వత్రిక ఎన్నికలకు ముందు, తరవాత రాజ్యాంగంపై విపరీతమైన చర్చలు జరుగుతున్నాయి. కారణం ఒక పార్టీ అధికారంలోకి వస్తే, కొనసాగితే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ.... విపక్షాలు పెద్దఎత్తున ప్రచారంలోకి తెచ్చాయి. మరి రాజ్యాంగాన్ని మార్చడం అంత సులభమా. ఆర్టికల్ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ ఆర్టికల్‌లో నిజంగా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించవచ్చా? ఈ మాట విన్నప్పుడల్లా ఏదో తెలియని అలజడి. సమాజాన్ని అంతా కదిలించిందని అనేక వార్తలు పత్రికల్లో ప్రస్ఫుటిస్తున్నాయి. దీని గురించి స్పష్టతనిచ్చే ఏదైనా అంశం ఉందా అని పరిశీలిస్తే మనకు కనపడేది ఒకే ఒక్క ఆశాకిరణం అదే 'రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం.

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
ఇండియన్ పాలిటీ

రాజ్యాంగంలో ప్రాథమిక(మౌలిక) నిర్మాణం అనే భావన ప్రస్తావించలేదు. ఈ సిద్ధాంతం సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఉద్భవించింది. కాబట్టి ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం అనేది భారతీయ న్యాయసూత్రం. భారత రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లక్షణాలను కలిగి ఉంది. వీటిని పార్లమెంటు సవరణల ద్వారా మార్చలేం. లేదా నశింపచేయలేం. రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలతో విభేదించే లేదా మార్చడానికి పార్లమెంటు ద్వారా



రూపొందించిన రాజ్యాంగ సవరణ చట్టాలను సమీక్షించడానికి, కొట్టివేయడానికి సుప్రీంకోర్టుకు గల అధికారం ఈ సిద్ధాంతానికి ఆధారం. అయితే ప్రకరణ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏదైనా భాగాన్ని సవరించవచ్చు అన్న పరిమితులు లేని పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ, తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను పేర్కొంటూ, ఈ రాజ్యాంగ మౌలిక లక్షణాలను మాత్రం స్పృశించరాదంటూ(సవరించరాదంటూ) పార్లమెంటుకు కొన్ని పరిమితులను, హద్దులను ఏర్పాటుచేస్తూ న్యాయవ్యవస్థ తన తీర్పుల ద్వారా రూపొందించిన సిద్ధాంతమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారా సుప్రీంకోర్టు, రాజ్యాంగం పవిత్రతను, రాజ్యాంగ స్వభావాన్ని పరిరక్షిస్తోంది. అందుకోసం రాజ్యాంగం తనకు కల్పించిన అధికారంతో పార్లమెంటు రాజ్యాంగ మౌలిక వ్యతిరేక రాజ్యాంగ సవరణ చట్టాలను తన తీర్పులతో ఖండిస్తూ వస్తోంది. రాజ్యాంగ ప్రాథమిక ఆదర్శ భావాలను తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోకి తెస్తూ మౌలిక నిర్మాణ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తూ ఉంది.

మౌలిక, స్వరూప సిద్ధాంత పరిణామక్రమం

కేశవానంద భారతి కేసు(1967)లో సుప్రీంకోర్టు పార్లమెంటుకు 368వ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే అలాంటి అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ(1971)ను చేసింది. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రకరణ 13(2) కింద చెల్లవని ప్రకటించడానికి వీల్లేదు. అయితే కేశవానంద భారతి కేసు(1973)లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, కానీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' మార్చే అధికారం మాత్రం లేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పులోని ప్రధానాంశాలను పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారాలపై అంతర్గతమైన, కనిపించని పరిమితిని ధర్మాసనం విధించినట్లు తెలుస్తుంది. ఈ తీర్పునే రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రవచించిన కేసుగా ప్రస్తావిస్తున్నారు.

కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు. అవి-

- రాజ్యాంగ ఆధిక్యత ● ప్రవేశిక
- ప్రజాస్వామ్య, గణతంత్ర ప్రభుత్వం
- రాజ్యాంగపరంగా లౌకిక స్వభావం
- శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య అధికార పృథక్కరణ ● సమాఖ్య లక్షణం
- భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
- ప్రజాస్వామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ కలిగి ఉండటం
- వైయక్తిక స్వేచ్ఛ

ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1975)

ఈ కేసులో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు.

- భారతదేశం ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
- సమాన హోదా అవకాశాలు ● లౌకికత్వం
- అంతరాత్మ స్వాతంత్ర్యం ● సమన్యాయం

మినర్వా మిల్స్ కేసు(1980)

కేశవానంద భారతి కేసు తీర్పు తరవాత పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ప్రకరణ 368కి 4, 5 క్లాజులను చేర్చి న్యాయసమీక్షాధికారాన్ని తగ్గించడం ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. అయితే సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసులో ప్రకరణ 368కి చేర్చిన 4, 5 క్లాజులు చెల్లవని తీర్పుచెప్పి రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసి తన ఉనికిని సగౌరవంగా చాటుకుంది.

వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1981)

ఈ కేసులో కూడా మౌలిక నిర్మాణ సూత్రాన్ని సుప్రీంకోర్టు మరోసారి నొక్కిచెప్పింది. మౌలిక నిర్మాణం అనే భావన 24 ఏప్రిల్ 1973(కేశవానంద భారతి కేసు తీర్పు) తరవాత జరిగిన అన్ని రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీర్‌లో కాంట్రాక్ట్ వర్క్స్ రద్దుకు సంబంధించి దాఖలైన కేసులో జమ్మూకాశ్మీర్, లడ్డాఖ్ హైకోర్టు వ్యాఖ్యానిస్తూ... ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన జీవించేహక్కు అండ్ స్వేచ్ఛహక్కు; ఆర్టికల్ 19(ఐ)(జి) ప్రకారం హామీ ఇచ్చిన వాణిజ్యం లేదా వ్యాపారాన్ని కొనసాగించే హక్కు తప్పనిసరిగా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా కూడా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని తారుమారుచేయడం సాధ్యం కాదని 29 జూలై 2024న కోర్టు పేర్కొనడం గమనార్హం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

- కిహోటో హోలోహన్ వర్సెస్ జుచిల్లు కేసు(1992): ఈ కేసులో ప్రాథమిక నిర్మాణ లక్షణాలకు స్వేచ్ఛ, న్యాయమైన ఎన్నికలు జోడించారు.
- ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1992): ఈ కేసులో 'రూల్ ఆఫ్ లా'ను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.
- ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1994): ఈ కేసులో సమాఖ్య నిర్మాణం, భారతదేశ ఐక్యత, సమగ్రత, లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, న్యాయసమీక్ష ప్రాథమిక లక్షణాలుగా పునరుద్ఘాటించింది.
- ఐఆర్ కొయల్హో వర్సెస్ తమిళనాడు కేసు(2007): ఈ కేసులో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడిన తరవాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని పేర్కొన్నారు.

టైమ్ సీక్వెన్స్ టెస్ట్

రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

1. ముగ్గురు స్నేహితులు సినిమాకి వెళ్లాలనుకున్నారు. సాగర్ "నేను శుక్రవారం, శనివారం, సోమవారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. మరో స్నేహితుడు సందీప్ "నేను బుధవారం, శుక్రవారం, ఆదివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. ఇంకొక స్నేహితుడు శ్రీకర్ "నేను సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. అయితే వారు ముగ్గురు ఏ రోజున సినిమాకు వెళ్లడానికి సాధ్యమవుతుంది.

ఎ) గురువారం బి) శుక్రవారం
సి) ఏరోజు సాధ్యం కాదు డి) చెప్పలేం.

సమాధానం: (సి)

వివరణ: సాగర్ అందుబాటులో ఉండే రోజులు శుక్ర, శని, సోమ వారాలు. సందీప్ అందుబాటులో ఉండే రోజులు బుధ, శుక్ర, ఆది వారాలు. శ్రీకర్ అందుబాటులో ఉండే రోజులు సోమ, గురు శని వారాలు

ముగ్గురుస్నేహితులకు కామన్‌గా ఏ రోజు అందుబాటులో లేదు. కావున ఏ రోజు సాధ్యంకాదు అనేది సమాధానం అవుతుంది.

2.ఆకాశ్ ప్రతి రోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరే సమయం కంటే ఈరోజు 15 ని.లు ముందు బయలుదేరాడు. ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.లు సమయం అవసరం. ఈరోజు ఆకాశ్ బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఎ.ఎం. అని అతను ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఏ సమయంలో బయలుదేరేవాడు?

ఎ) 8.30 ఎ.ఎం. బి) 8.45 ఎ.ఎం.
సి) 8.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ:ఆకాశ్ ఈరోజు బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.ల సమయం అవసరం అనగా ఈరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన సమయం 8.40-10=8.30 ఎ.ఎం. ప్రతిరోజు కంటే ఈరోజు 15 ని.ల ముందు బయలుదేరాడు. అనగా దీని అర్థం ప్రతిరోజు, ఈరోజు కంటే 15 ని.ల ఆలస్యంగా బయలుదేరతాడని అర్థం. కావున ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఆకాశ్ బయలుదేరు సమయం 8.30+15=8.45 ఎ.ఎం.(ప్రతిరోజు 8.45 ఎ.ఎం.కి బయలుదేరితేనే కదా ఈ రోజు 15 ని.లు ముందుగా అనగా 8.30 ఎ.ఎం. అయ్యేది.)

3. ఒక మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.లు ముందు వచ్చారు. ఈయన అతిథుల కంటే 15 ని.లు ఆలస్యంగా వచ్చారు. అతిథులు సమావేశ సమయం కంటే 5 ని.ల ముందు ఉన్నారు అయితే ఏ సమయంలో సమావేశాన్ని నిర్వహించవచ్చు?

ఎ) 10.15 ఎ.ఎం. బి) 10.20 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (సి)


వివరణ: మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.ల ముందు వచ్చారు. అనగా మంత్రి చేరుకొన్న సమయం 11.00-20=10.40 ఎ.ఎం. ఆయన అతిథుల కంటే 15 ని.ల ఆలస్యంగా వచ్చారు అనగా దీని అర్థం అతిథులు, మంత్రిగారి కంటే 15 ని.ల ముందుగానే ఉన్నారు. కావున అతిథులు వచ్చిన సమయం 10.40 - 15 ని.లు = 10.25 ఎ.ఎం. అతిథులు సమావేశానికి 5 ని॥ ముందుగానే ఉన్నారు. అనగా 5 ని॥లలో సమావేశం ప్రారంభమవుతుందని అర్థం. కావున సమావేశ సమయం 10.25 + 5 = 10.30 సమాధానం అవుతుంది.

4. ఇంటర్వ్యూను నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు వచ్చారు. అయితే ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు?

ఎ) 11.00 ఎ.ఎం. బి) 11.10 ఎ.ఎం.
సి) 10.50 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం: (ఎ)

వివరణ: మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. అనగా మేనేజింగ్ డైరెక్టర్ వచ్చిన సమయం 10.30 - 15 = 10.15 ఎ.ఎం. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందుగానే ఉన్నాడు. అనగా దీని అర్థం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కంటే 20 ని.ల ఆలస్యంగా వచ్చారని తెలుస్తున్నది. అనగా చైర్మన్ వచ్చిన సమయం 10.15+20=10.35 ఎ.ఎం. ఆయన ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు ఉన్నాడు. అనగా ఆయన వచ్చిన 25 ని.ల తరవాత



ఇంటర్వ్యూ జరుగుతుందని అర్థం. కావున ఇంటర్వ్యూ నిర్వహించే సమయం 10.35+25 ని.లు = 11.00 ఎ.ఎం. సమాధానం అవుతుంది.

5. ఒక రైలు విజయవాడకు ప్రతి గంటకు ఉంది. విచారణాధికారి(ఎంక్వైరీ క్లర్క్) తనను కలిసిన ప్రయాణికులతో రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయినది. తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?

ఎ) 10.20 ఎ.ఎం. బి) 10.15 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

సమాధానం:(బి)

వివరణ: ప్రశ్నలో రైలు ప్రతి గంటకు ఉంది తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అనగా దాని ముందు రైలు సమయం 10.00 ఎ.ఎం. విచారణాధికారి (ఎంక్వైరీ క్లర్క్) రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయిందని చెప్పారు. అనగా దీని అర్థం ప్రయాణికుడు 15 ని.ల ఆలస్యంగా వచ్చాడు (ఆలస్యంగా వస్తేనేగా రైలు వెళ్ళిపోయింది) కావున విచారణాధికారికి, ప్రయాణికుడికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.00 + 15 ని॥ = గం॥ 10.15 ని.లు సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ



కొత్త లుక్‌లో

క్లాస్ లుక్‌లో సింపుల్‌గా చిరునవ్వుతో కనిపించే మహేశ్‌బాబు ఈసారి సరికొత్త లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన పోనీటెయిల్, గుబురుగడ్డంతో ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళితో చేస్తున్న చిత్రం కోసమే మహేశ్ ఈ కొత్తలుక్‌లోకి మారారని టాక్. ఇటీవలే మహేశ్‌బాబు తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలసి విహార యాత్రకు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు జైపూర్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు.

రెండింతల వినోదంతో వస్తున్నాం

- పూరి జగన్నాథ్



'రామ్ పోతినేని లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. డబుల్ ఎనర్జీతో ఈ సినిమా చేశాడు. సంజయ్‌దత్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకార్షణ. రామ్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి' అని దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రేక్షకులను కోరాడు. ఆయన దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ "ఇస్మార్ట్ శంకర్‌కు మించేలా 'డబుల్ ఇస్మార్ట్' ఉంటుంది. పూరి జగన్నాథ్ గన్ లాంటివారు. గన్ బావుంటే బుల్లెట్ ఎంత ఫోర్స్‌తో అయినా వెళుతుంది. పూరి గారి లాంటి గన్ అందరి యాక్టర్స్‌కి కావాలని ఈ సినిమాతో తెలిసింది. సంజయ్‌దత్‌తో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. పాటలు ప్రజాదరణ పొందాయి, సినిమా కూడా ఘన విజయం అందుకుంటుందనే నమ్మకం ఉందన్నారు నిర్మాత ఛార్మీ కౌర్. డబుల్ కామెడీ, డబుల్ యాక్షన్, డబుల్ మ్యాజిక్‌లా సినిమా ఉండబోతోందని కథానాయిక కావ్య థాపర్ చెప్పారు.

విడాకులు... మీడియా ప్రచారమే



ఐశ్వర్యతో విడిపోతున్నట్లు వస్తున్న వదంతులపై అభిషేక్ బచ్చన్ ఎట్టకేలకు స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కొన్ని ఆసక్తికర వార్తల కోసం మీరు (మీడియా) ఇదంతా చేస్తున్నారు. మేం సెలబ్రిటీలం కాబట్టి ఇలాంటి వాటి గురించి పట్టించుకోను. నేను ఇంకా వివాహ బంధంలోనే ఉన్నాను. క్షమించండి' అంటూ తన వేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించాడు. దీంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న అభిషేక్ తమపై వస్తున్న రూమర్లకు ప్రస్తుతానికి చెక్ పెట్టినట్లైంది. ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అనంత్ అంబానీ పెళ్లికి విడివిడిగా హాజరవడంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారేమోనని భావించారు. ఐశ్వర్యతో విడిపోతున్నట్లు అభిషేక్ బచ్చన్ చెబుతున్న డీప్‌ఫేక్ వీడియో ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

డబుల్ ఇంపాక్ట్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం చిత్రబృందం డబుల్ ఇంపాక్ట్ పేరుతో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. వరుణ్‌తేజ్ యువకుడిగా, మధ్య వయస్కుడిగా రెండు విభిన్న గెటప్పుల్లో అలరించారు. వింటేజ్ లుక్‌లో సిగార్ తాగుతూ కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో మాఫియా లీడర్ పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

థియేటర్లలో పెళ్ళి... మంచి పద్ధతి కాదు



థియేటర్లలో పెళ్లిళ్లు చేసుకునే పద్ధతి మంచిది కాదని దర్శకుడు కృష్ణవంశీ హితవు పలికారు. ఆయన దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం ఇటీవలే రీ రిలీజైన సందర్భంగా ఓ ప్రేమజంట థియేటర్‌లోనే పెళ్లి చేసుకుంది. నెటిజన్లు ఆ వీడియోలను కృష్ణవంశీకి ట్యాగ్ చేస్తూ షేర్ చేస్తున్నారు. దీంతో ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలను కించ పరచొద్దు. నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇలాంటి పనులు చేయకండి. అవగాహన లేక వారిద్దరూ అలా చేసి ఉంటారు. వారికి మంచి భవిష్యత్ ఉండాలి' అని ఆకాంక్షించారు.

ఖాకీ పాత్రల్లో కథానాయికలు

వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే.. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే... ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

లేడీ సింగం...

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీస్‌గా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

మర్డర్ మిస్టరీని ఛేదించే పాత్రలో...

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'ఆంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.

శత్రు సంహారానికై...

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్దే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

వెబ్ సిరీస్‌లోనూ..

వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీస్‌లో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమ్రిత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

రెండో సీజన్ వచ్చేస్తోంది...

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహుమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.










పవర్‌ఫుల్ పాత్రలో...

'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్రా. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.



స్విట్జర్లాండ్‌లో జరిగిన లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్‌ను పార్డో అల్లా కారియారా పురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నటుడు షారూఖ్ కావడం విశేషం.

కొత్తగా...

సరికొత్త వీక్షణం



రామ్ కార్తిక్, కశ్వి జంటగా రూపొందుతున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మ చీకటిలో బైనాక్యులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో నిల్చున్న హీరో లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్

క్రైమ్ సస్పెన్స్ కలబోతగా



విశ్వంత్, శిల్పా మంజునాథ్ జంటగా బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హైడ్ అండ్ సీక్'. నరేంద్ర బుచ్చిరెడ్డి గారి నిర్మించారు. నటుడు శివాజీ ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. మా సినిమా సమర్పకుడు నవీన్ మేడారం ఫస్ట్ కాపీ చూసి బావుందని ప్రశంసించారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లిజో కే జోష్, సినిమాటోగ్రఫీ: చిన్న రామ్

పైసా వసూల్ ఎంటర్‌టైనర్



చిమటా రమేశ్ బాబు హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేశ్ మాట్లాడుతూ "బ్లాక్‌బస్టర్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేమ కథతో పాటు చక్కని వినోదం మేళవించి తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "ఇది పైసా వసూల్ ఎంటర్‌టైనర్" అని నిర్మాత జ్యోతిర్మయి తెలిపారు.

నిర్లక్ష్యం నీడన.. సాయన్న చానల్


రేగిడిలో జంగిల్‌తో ఉన్న సాయన్నచానల్ ఇదే..

- పాలకులు మారుతున్నా మారని రూపురేఖలు
- రెండు మండలాలకు సాగునీటి సమస్యలు

రేగిడి, ఆగస్టు 11: గత ప్రభుత్వ పాలనలో సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం చూపడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువల నిర్వహణ లేక, మరమ్మతులు చేపట్టకపోవడంతో సాగునీటికి పాట్లు తప్పడం లేదు. దీనికి సజీవ సాక్ష్యం సాయన్నచానల్..

రేగిడి, సంతకవిటి మండలాల్లో 11600 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ ఉన్న సాయన్నచానల్, హెడ్‌రెగ్యులేటర్ సిస్టమ్స్‌తో పాటు, దాని అనుబంధ కాలువలు పాలకుల నిర్లక్ష్యంతో మరుగున పడుతున్నాయి. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టు రూపురేఖలు మారటం లేదు. దీంతో ఏటా ఖరీఫ్ రైతులకు సాగునీటి కష్టాలు తప్పటం లేదు.

మండలంలో పాతచెలిగానవలస వద్ద నాగావళి నది నుంచి సాయన్న చానల్ ప్రారంభం అవుతుంది. వరదల సమయంలో మిగులు జలాలు వృథా కాకుండా దీనిగుండా పారేలా 15 కిలోమీటర్లు మేర ప్రధాన కాలువతో పాటు 13 వరకు ఉపకాలువలు ఉన్నాయి. ఉపకాలువలు దాదాపు 50.46 కిలోమీటర్ల పొడువున ఉన్నాయి. వీటిలో సాయన్నగెడ్డ, కవిటిబట్టి, శెలగబట్టి, గొపాలరావుబట్టి, మర్రిపుడత, బొడ్డవలస బట్టి, చిట్టగెడ్డ.. ఇంకా చిన్నచితక బట్టిలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక్క రేగిడి మండలంలో 8364 ఎకరాల ఆయకట్టు ఉండగా, సంతకవిటి మండలంలో మరో 3వేల ఎకరాలపైబడి ఆయకట్టు స్థిరీకరణ ఉంది. ప్రస్తుతం రెగ్యులేటర్లు శిథిలదశకు చేరగా, నిర్వహణపనులు లేకపోవటం వల్ల కాలువలు కుచించుకుపోతున్నాయి.

వైసీపీ హయాంలో స్థానిక రైతుల విజ్ఞాపనతో ఎంఎల్‌సీ పాలవలస విక్రాంత్‌బాబు, అప్పటి ఎమ్మెల్యే కంబాల జోగులు సిఫార్స్ మేరకు ఇరిగేషన్ అధికారులు రూ. 13.25కోట్ల అంచనాతో పనులకు ప్రతిపాదనలు సిద్ధంచేశారు. ప్రతిపాదించినవాటిలో గట్లు పటిష్ఠపరచటం, తూముల నిర్మాణం, రెగ్యులేటర్లుకు మరమ్మతులు, పూడికల తొలగింపు, కాలువ వెడల్పు, ఆక్రమణల తొలగింపు, అవసరమైన చోట మినీ వంతెనలు నిర్మాణం తదితరాలు చేపట్టాలని భావించారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపినా ఎటువంటి ఫలితం రాలేదు.


సంకిలి వద్ద చిట్టగెడ్డ రెగ్యులేటర్ షట్టర్లు పరిస్థితి ఇలా..


చిట్టిగెడ్డ షట్టర్లు పాడవటంతో రైతులే బాగుచేసుకుంటున్న దృశ్యం (ఫైల్)

కొత్త ప్రభుత్వం చేయాల్సిన పనులివే..

చెలిగానవలస హెడ్ నుంచి ఆరుచోట్ల ఉన్న రెగ్యులేటర్లు బాగుచేయాలి. కాలువ ప్రారంభం నుంచి 7వ కిలోమీటర్ వరకు తొమ్మిది మీటర్ల వెడల్పు ఉండాల్సిన కాలువలు ప్రస్తుతం 5.5 మీటర్లు వెడల్పు మాత్రమే ఉన్నాయి. వీటిపై ఆక్రమణల తొలగింపు చేపట్టాలి. సాయన్నచానల్ రెండు మండలాల్లో ఉన్న 13 ఉపకాలువల్లో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. వీటిని తొలగించి తక్షణమే వీటికి ఆధునీకరణ పనులుచేయాలి. కాలువ గట్లను తక్షణమే పటిష్ఠ పరచాలి.

కీలకమైన కొరంబో పనుల విస్మరణ..

వేసవిలో సాయన్నచానల్‌లో ఏటా సాగునీటి ఇబ్బంది ఉంటుంది. నాగావళిలో నీటి ప్రవాహం తగ్గిన సమయంలో ఏటా ప్రొక్లెయిన్‌తో ప్రధాన కాలువను బాగుచేసేవారు. ఈప్రక్రియను కొరంబో పనులు అంటారు. గత నాలుగేళ్ల నుంచి కొరంబో పనులు చేయటం మానేశారు. దీంతో కొన్ని చోట్ల రైతులే ముందుకు వచ్చి శ్రమదానంచేసి పూడికలు తొలగించటం, పాడైన షట్టర్లకు కర్రలతో అడ్డు పెట్టి నీరు మళ్లించుకోవడం చేస్తున్నారు. గతంలో ఎంపీలాడ్స్, నీటిపారుదలశాఖ నుంచి నిధులు కేటాయింపు ఉండేది. ప్రస్తుతం ఈ నిధుల కేటాయింపు మర్చిపోయారు.

నివేదికలు పంపించాం..

ఈ కాలువల మరమ్మతులు, షట్టర్లు, ఇతర నిర్మాణాలపై ప్రభుత్వానికి నివేదించాం. గతంలో మరమ్మతులకు సంబంధించి ఒకటి రెండు సార్లు ప్రతిపాదనలు పంపిన మాట వాస్తవమే. అప్పట్లో రూ. 13.25 కోట్ల పనులు గుర్తించాం. కానీ అప్పట్లో నిధుల కేటాయింపు లేక పనులు చేయలేకపోయాం.

-రాజేష్, ఇరిగేషన్ ఏఈ

పెళ్లింట విషాదం

- విద్యుదాఘాతంతో యువకుడి మృతి
- తెల్లవారితే తమ్ముడి వివాహం
- గౌరీపురంలో విషాదచాయలు


చంద్రశేఖర్ (ఫైల్)

జియ్యమ్మవలస: కుదమ పంచాయతీ పరిధిలోగల గౌరీపురం గ్రామంలో ఓ పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. తెల్లవారితే తన తమ్ముడు వివాహం నిర్వహించేందుకు అన్ని ఏర్పా ట్లు పూర్తిచేశారు. ఇంతలో శనివారం రాత్రి విద్యు దాఘాతంతో అన్నయ్య మృతి చెందడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. గ్రామస్థులు, పోలీసుల కథనం మేర కు.. మండలంలోని గౌరీపురం గ్రామానికి చెందిన అంకలాపు చంద్రశేఖర్(32) తండ్రి అప్పలస్వామి మృతిచెందడంతో కుటుంబానికి పెద్ద దిక్కై తమ్ముడు లక్ష్మణరావుకు పెళ్లి కుదిర్చారు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో వివాహం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇంతలో శనివారం రాత్రి ఒంటి గంట సమయంలో చంద్రశేఖర్ పొలానికి నీరు తిప్ప డానికి పంట పొలానికి వెళ్లగా అక్కడ విద్యుత్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గుర య్యాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు క్షతగాత్రుడిని పార్వతీపురం కేంద్రాసుపత్రికి తరలించారు. అప్పటికే చంద్రశేఖర్ మృతి చెందినట్లు నిర్ధారించిన వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం పోస్టుమార్టం నిర్వహించి చిన మేరంగి ఎస్ఐ స్థానంలో ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న గరుగుబిల్లి ఎస్ఐ అమ్మన్నరావు కేసు నమోదు చేశారు. చంద్రశేఖర్‌కు తల్లి లక్ష్మి, తమ్ముడు లక్ష్మణరావు ఉన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రమైన విజయనగరం, రాజాం, బొబ్బిలి తదితర ప్రాంతాల్లో రాత్రి 11 గంటల తరువాత వ్యాపార, వాణిజ్య సంస్థలను తెరచి ఉంచరాదన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా పై ప్రత్యేక నిఘా ఉంచామని, ఇందుకోసం పగలు, రాత్రుళ్లు ప్రత్యేక బృందాలు జిల్లా వ్యాప్తంగా తిరుగుతుంటాయన్నారు. అదే విధంగా సామాజిక మాధ్యమాల్లో పోస్టులను విజ్ఞతతో పెట్టాలని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవి, మత, కుల విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా ఉంటే, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, దొంగతనాలు, గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, క్రైం రేటు తగ్గించడం తదితర కారణాలతో జిల్లాలో పోలీసుశాఖ తరుపున ఆంక్షలు విధిస్తున్నామని, దీనికి ప్రజాప్రతినిధులు, ప్రజలు, వ్యాపారులు, మహిళలు, అన్ని వర్గాల వారు పోలీసులకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

రాత్రి 11 గంటల తరువాత ఆంక్షల అమలు

బొబ్బిలి/రూరల్: ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణంలో రాత్రి 11 గంటల తరువాత ఆంక్షల అమలులో ఉంటాయని సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఎస్ఐ లోవరాజు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి 11 తరువాత షాపులు తెరిచిఉంచినా, గుంపులుగా సంచరించినా, అనుమానాస్పదంగా తిరుగాడినా టౌన్ న్యూసెన్స్ యాక్టు ప్రకారం కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. ఈ హెచ్చరికలను అందరూ గమనించి అప్రమత్తులై ఆంక్షలను పాటించాలని సూచించారు.

సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలి

రామభద్రపురం: రాష్ట్రంలో ఉన్న తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మండలకేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌రావడంతో రైతులు పెట్టుబడి మదుపులకు రైతుభరోసా ఇంతవరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటువంటి తరుణంలో సహాయం ఎంతచేసినా తక్కువేనన్నారు. ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ ప్రభుత్వం పోలవరం నిర్మించడానికి చర్యలు తీసుకుంటుందే తప్ప నిర్వాసితుల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. వెనుకబడిన జిల్లాలకు కేంద్రం ప్రకటించిన నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. బొబ్బిలిలో ఉన్న గ్రోత్ సెంటర్‌లో పరిశ్రమల స్థాపనకు ఏ ఒక్క ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా బొబ్బిలి గ్రోత్‌సెంట్‌లో పరిశ్రమలు ఎక్కువగా స్థాపించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆయన కోరారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్.కృష్ణమూర్తి అన్నారు. స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో జానపద గేయాలు, బాలమిత్ర కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, పంచతంత్ర కథలు, అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలు చదివించారు. చిల్డ్రన్స్ క్లబ్‌లో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ

కొత్తవలస: మండలంలోని మంగళపాలెం గ్రామంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహాసిమెంట్ యాజమాన్యం సహకారంతో తెలంగాణ రాష్ట్రం, కోదాడ జిల్లా మేళ్ల చెరువు గ్రామానికి చెందిన 170 మంది దువ్యాంగులకు కృత్రిమ అవయవాలు, వీల్ చైర్స్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశామని ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. తమ ట్రస్టు ద్వారా చేస్తున్న కార్యక్రమాలను మహాసిమెంట్ యాజమాన్యం తెలుసుకుని ట్రస్టు ద్వారా కృత్రిమ అవయవాలను అందించడానికిముందుకు వచ్చిందన్నారు. ఇందుకోసం ముందుగానే దివ్యాంగులకు సంబంధించి కొలతలను తీసుకుని తరువాత ఆ కృత్రిమ అవయవాలను అందచేశామన్నారు.

మిగులు సీట్ల భర్తీకి అడ్మిషన్లు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట గురుకుల పాఠశాలలో 5, 6, 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 20లోగా దరఖాస్తులతో పాఠశాలకు హాజరు కావాలన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీ ఉన్న సీట్లు భర్తీ చేయనున్నామని, మొత్తం సీట్లు అన్నీ ఎస్సీ అభ్యర్థులకు కేటాయించినట్టు తెలిపారు.

మెగా రక్తదాన శిబిరం

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కరెడ్ల సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆదివారం మెగారక్తదాన శిబిరం నిర్వహించారు. యువజన దినోత్సవం సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్య అతిథిగా ఎస్.కోట నియోజకవర్గ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి దంపతులు హాజరయ్యారు. యువకుడు టీడీపీ రాష్ట్ర యువజన నాయకుడు కరెడ్ల సత్యనారాయణ గత ఏడాది విద్యుదాఘాతంతో అకాల మరణం చెందడంతో ఆయన జ్ఞాపకార్థం గ్రామ యువకులు రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారన్నారు. కేబీఏ.రాం ప్రసాద్, చొక్కా కుల మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి పాల్గొన్నారు.

సహారా ఖాతాదారుల ర్యాలీకి తరలిరావాలి

బొబ్బిలి రూరల్: సహారా ఖాతాదారులు ఈనెల 14న బొబ్బిలిలో జరగబోయే భారీ ర్యాలీకి తరలి రావాలని పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీదాస్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం సహారా ఆస్తులను కొల్లగొట్టేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. దేశంలో 13 కోట్ల మంది ఖాతాదారులు, 12 లక్షల మంది ఏజంట్లను నిలువునా ముంచేయడానికే హోం మినిస్టర్ అమిత్ షా, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రయత్నం చేస్తున్నారన్నారు. అనంతరం ర్యాలీకి సంబంధించి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

లక్కవరపుకోట, ఆగస్టు 11: శృంగవరపుకోట నియోజకవర్గంలో టీడీపీకి ఇతర పార్టీల నుంచి వస్తున్న చేరికలతో మరింత బలం చేకూరుతుందని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నాటికి ఇతర పార్టీలు దాదాపుగా కనుమరుగవుతాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. ఆదివారం ఆమె స్వగృహం వద్ద వేపాడ మండలం జాకేరు గ్రామం నుంచి సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు సుమారు 200 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. సర్పంచ్ బుద్ధ చిన్నమ్మలు, అప్పలనాయుడు, ఉప సర్పంచ్ వారాది అప్పలనాయుడు, వార్డు సభ్యులు, పెద్దలు కే.సూరిబాబు, ఎస్.నరేంద్ర పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ ఎమ్మెల్యే దంపతులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వేపాడ మండల టీడీపీ కార్యదర్శి కొట్యాడ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే దంపతులు

ఇది రోడ్డే..!


అధ్వానంగా ఉన్న రోడ్డు

బాడంగి, ఆగస్టు 11: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ మధుర గ్రామమైన ఎరుకుల పాకలు గ్రామం నుంచి పంచాయతీ కేంద్రమైన లక్ష్మీపురం వెళ్లేందుకు మెటల్, సీసీ రోడ్డు నిర్మించి ఎరుకులపాకలు గ్రామ ప్రజల కష్టాలు తీర్చాలని సర్పంచ్ పాలవలస పార్వతి, ఎంపీటీసీ పాలవలస గౌరీ కోరారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ 2004వ సంవత్సరంలో దివంగత ఎమ్మెల్యే తెంటు జయప్రకాష్ ఎరుకులపాకలు నుంచి లక్ష్మీపురం గ్రామానికి రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ.7 లక్షలు నిధుల రూపంలో కేటాయిచారని, అయితే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలో నాయకులు పని ప్రారంభించినప్పటికీ బిల్లులు అవ్వకపోవడంతో పనులు నిలుపుదల చేశారన్నారు. కాగా గ్రామస్థులంతా ప్రతీ అవసరానికి పంచాయతీ కేంద్రమైన లక్ష్మీపురం వెళ్లవలసి వస్తోందని తెలిపారు. ముఖ్యంగా రేషన్ సరుకులు నిమిత్తం వృద్ధులు, మహిళలు పొలాల మధ్యలో నుంచి వెళ్లి రావడంతో నానా ఇబ్బందులు పడుతున్నామన్నారు. పాలకులు, సంబంధిత అధికారులు స్పందించి ఎరుకుల పాకలు గ్రామం నుంచి లక్ష్మీపురం వెళ్లేందుకు మెటల్ లేదా సీసీ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

బలవంతపు మతమార్పిడి ప్రమాదకరం


మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

బొబ్బిలి రూరల్: మండలంలోని గోపాలరాయుడుపేట పంచాయతీ నారశింహునిపేట గ్రామంలో ఆదివారం శ్రీఆంజనేయస్వామి దేవాలయం పూర్ణకళశం ప్రతిష్ఠాపన కార్యక్రమం గ్రామ పురోహితులు కొడుకుళ్ల సూర్యశర్మ వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా శ్రీకాకుళం జిల్లా శ్రీహరిపురం ఆశ్రమపీఠాధిపతి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధుసంత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బలవంతపు మతమార్పిడి మహాప్రమాదమని, మతం మారిన తర్వాత సంస్కృతులు నాశనం అవుతాయని హితవు పలికారు. బొబ్బిలి డివిజన్ ధర్మప్రచారకులు ధూపం వాసు, మండల కన్వీనర్ గేదెల జనార్దనరావు, మండలి కమిటీ సభ్యులు కునుకు సత్యనారాయణ, గ్రామస్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్మిక చట్టాలు అమలు చేయాలి

విజయనగరం దాసన్నపేట: ఆర్టీసీ హైర్ బస్సుల డ్రైవర్లు, కాంట్రాక్టు కార్మికులకు బేసిక్ వేతనాలు, కార్మిక చట్టాలు అమలు చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.తులసీరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్‌బీజీ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ హైర్ బస్సు డ్రైవర్లు, కార్మికుల పరిస్థితి వుందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు జగన్మోహన్‌రావు, జెఎస్ఎన్ రాజు, సురేష్, ధనుంజయ, మధు, వాసు, కోటి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి అకాడమీ పుస్తకాలు అందజేత

శృంగవరపుకోట: మండల కేంద్రంలో ఉన్న శాఖాగ్రంథాలయానికి ఎస్.కోటకు చెందిన రిటైర్డ్ స్టేషన్ మాస్టర్ ఎంఎస్ఎన్ మూర్తి, ఓటర్ అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకుడు దొడ్డి సూర్యారావు, డీఎస్సీకి సిద్ధమవుతున్న విద్యార్థులు ఆకాడమీ పుస్తకాలు అందించారు. వీటిని లైబ్రేరియన్ శ్రీధర్‌కు అందించారు.

విశాఖ, తూర్పుగోదావరి జట్ల విజయం


విజ్జీ క్రికెట్ మైదానంలో తూ.గో జట్టు, విజయనగరం జట్ల మధ్య మ్యాచ్ దృశ్యం

విజయనగరం టౌన్, ఆగస్టు 11: జిల్లా కేంద్రంలోని సర్ విజ్జీ క్రికెట్ మైదానం, చింతలవలసలోని డాక్టర్ పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ అకాడమీ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల పురుషుల సీనియర్ క్రికెట్ పోటీల్లో విశాఖ, తూర్పుగోదావరి జట్లు తమ ప్రత్యర్థి జట్లపై విజయాలు సాధించి ఆరేసి పాయింట్లు తమ ఖాతాల్లో వేసుకున్నాయి. విజ్జీ క్రికెట్ మైదానంలో విజయనగరం, తూర్పుగోదావరి జట్ల మధ్య మూడు రోజులుగా నిర్వహిస్తున్న పోటీల్లో తూర్పుగోదావరి జట్టు 179 పరుగుల తేడాతో విజయనగరం జట్టుపై విజయం సాధించింది. ● డాక్టరు పీవీజీ రాజు నార్త్‌జోన్ క్రికెట్ మైదానంలో విశాఖ, శ్రీకాకుళం జట్ల మధ్య జరుగుతున్న మూడు రోజుల మ్యాచ్‌లో ఆఖరి రోజు జరిగిన పోటీలో విశాఖ జట్టు 140 పరుగుల తేడాతో శ్రీకాకుళం జట్టుపై గెలుపొందింది. తొలి ఇన్నింగ్స్‌లో 330 పరుగులు సాధించిన విశాఖ జట్టు, రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 154 పరుగులు సాధించింది. శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 209 పరుగులకు ఆలౌట్ కాగా, రెండో ఇన్నింగ్స్‌లో 142 పరుగులకే ఆలౌట్ అయి.. పరాజయం పాలైంది.

ఉచిత క్యాన్సర్ శిబిరం


వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులు

కొత్తవలస: కొత్తవలసకు చెందిన సుబ్బలక్ష్మి చారిటబుల్ ట్రస్టు, విశాఖకు చెందిన మహాత్మ గాంధీ క్యాన్సర్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో మండలంలోని దెందేరు గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి 116 మంది పాల్గొగా వీరికి పరీక్షలను నిర్వహించి నలుగురికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. వీరిని విశాఖలో ఉన్న క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చినట్టయితే పూర్తి స్థాయిలో పరీక్షలు చేసి మందులను ఇస్తామన్నారు. ట్రస్టు చైర్మన్ కనకాల శివ, క్యాన్సర్ ఆసుపత్రికి చెందిన వైద్యులు సుదానంద, శ్వేత, రమ్యతో పాటు పీఆర్వో నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

యూటీఎఫ్ సభ్యుల క్రికెట్ మ్యాచ్

బొబ్బిలి రూరల్: యూటీఎఫ్ 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం బొబ్బిలిలో డివిజన్ తరపున యూటీఎఫ్ సభ్యులతో క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో చక్కని క్రీడాస్ఫూర్తితో ఆనెం శ్రీను 112/6 (12 ఓవర్లు), సూరిబాబు 86 (8 సిక్స్‌లు, 6 ఫోర్లు), ప్రసన్నకుమార్ ఫైరటీస్ 88/6 (12 ఓవర్లు) మండల రమేష్ 75 (8 సిక్స్‌లు 4 ఫోర్లు), ఆనెం శ్రీను అవేంజర్స్ 24 రన్స్‌తో గెలిచారు. గెలిచిన క్రీడాకారులకు యూటీఎఫ్ రాష్ట్ర మహిళా నాయకురాలు విజయగౌరి, సభ్యులు అభినందనలు తెలిపారు.

రాయితీపై టేకుదుంపల పంపిణీ

శృంగవరపుకోట: మండలకేంద్రమైన శృంగవరపుకోటలో గ్రీన్‌ఎర్త్ ఆర్గనైజేషన్ వ్యవ స్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ రైతులకు రాయితీపై టేకుదుంపలు ఆదివారం అందించారు. కావాల్సిన వారు 9391138665ను సంప్రదించాలని కోరారు.

పదోన్నతుల తర్వాతే పని సర్దుబాటు చేయాలి

బొబ్బిలి రూరల్: బొబ్బిలిలో ఆదివారం స్థానిక ఎంజీవో హోమ్‌లో ఏపీటీఎఫ్ డివిజనల్ సమావేశం రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 117వ జీఓ రద్దు చేస్తామని చెప్పిన ప్రభుత్వం అదే జీవోతో పని సర్దుబాటు చేయటం అన్యాయం అన్నారు. ప్రభుత్వం చెప్తున్నది ఒకటి చేస్తున్నది ఒకటి అన్నారు. తక్షణమే పని సర్దుబాటు రద్దుచేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి పద్మావతి మాట్లాడుతూ 53వ జీవో ప్రకారం పని సర్దుబాటు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో కనీసం 4 పాఠశాల సహాయకులు పోస్టులు కొనసాగించాలని, ఆంగ్ల భాష బోధనకు పాఠశాల సహాయకులను నియమించాలన్నారు. పదోన్నతులు తర్వాతే పని సర్దుబాడు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏపీటీఎఫ్ నాయకులు ప్రవీణ్ కుమార్, సింహాచలం, కె శ్రీను, పరుశునాయుడు, రామ కృష్ణ, మోహన్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎంజీవో హోమ్‌లో ఏపీటీఎఫ్ డివిజనల్ సమావేశం దృశ్యం

ఎస్సీ వ్యతిరేక విధానాలు విడనాడాలి


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న లోగిశ రామకృష్ణ, తదితరులు

విజయనగరం దాసన్నపేట: సుప్రీంకోర్టు ఎస్సీ, ఎస్టీ ఉప వర్గీకరణ తీర్పును సమర్థిస్తూ, ఏపీ కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యులైన టీడీపీ, జనసేన, బీజేపీ ఎస్సీ వ్యతిరేక విధానాలు విడనాడాలని ఎస్సీ, ఎస్టీ పరిరక్షణ సమితి ప్రతినిధి భానుమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం ఉపవర్గీకరణ వ్యతిరేక కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టికల్ 341 సవరించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉందని, రాష్ట్రానికి లేదన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌కుమార్, ప్రభాకరరావు, సాకేటి కాసులు, తెలుగు రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మాలమహానాడు ఆధ్వర్యంలో ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయవద్దని మాల మహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. చిన్నపల్లి వీధిలోని పార్టీ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి చనిపోయిన మాల మృత వీరులకు కొవ్వొత్తులు వెలిగించి నినాదాలు చేశారు. సంఘ ప్రతినిధులు సింహాచలం, నాగరాజు, ఆనంద్, విజయలక్ష్మి, పద్మావతి, సావిత్రి, తులసీ, సునీత, రాములమ్మ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు గుర్తింపు ఇవ్వాలి

విజయనగరం రూరల్: సమాజంలో నిర్లక్ష్యానికి గురవుతున్న రజకులకు ప్రభుత్వం తగిన గుర్తింపును ఇవ్వాలని ప్రజావిజయం పార్టీ వ్యవస్థాపకుడు షన్ముఖరావు కోరారు. ఆంధ్రప్రదేశ్ రజక సేవా సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాగ్రంథాలయంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన షన్ముఖరావు, రజక సేవా సంఘం పూర్వ అధ్యక్షుడు మలిచర్ల దుర్గారావు చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో నేటికీ రజకులను చిన్నచూపు చూస్తున్నారని, గ్రామాల్లో ఇప్పటికీ కులం పేరుతో పిలుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులపై అగ్రకులాల తీరును ఆయన ఖండించారు. రజక సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యం మాట్లాడుతూ, ఇటీవల కాలంలో నిమ్నకులాలపై దాడులు పెరుగుతున్నాయని, ప్రభుత్వాలు కూడా చూసీచూడనట్టు వ్యవహరించడం ఆందోళనకరమన్నారు. వయస్సు పైబడిన రజకులకు పెన్షన్ సదుపాయం కల్పించా లన్నారు. రజక సంఘం ఉపాధ్యక్షుడు చిన్ని తల్లి, తామాడ అచ్చెన్న, కార్యదర్శిగా తాళ్ల రమణ, సహాయ కార్యదర్శి ఈ నాగరాజు, ఇస్త్రీ బళ్ల సంఘం అధ్యక్షుడిగా కెల్ల అప్పలరాజు, ఉపాధ్యక్షులుగా తామాడ ముత్యాలు, కోశాధికారిగా కె.గురుమూర్తి, ఇతర కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అయ్యారక సామాజికవర్గ అధ్యక్షుడిగా సత్యనారాయణ

కొత్తవలస: అయ్యారక సామాజిక వర్గం శృంగవరపుకోట నియోజకవర్గ ఎన్నికలు ఆదివారం కొత్తవలసలోని అయ్యారక సంఘసామాజిక భవనంలో జరిగాయి. అధ్యక్షుడిగా పెదిరెడ్ల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా నూకరాజు, కోశాధికారిగా లెంకేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా రామదాసు కాశి తదితరులు ఎన్నికయ్యారు.

కలిశెట్టికి అశోక్ మొక్క బహూకరణ

విజయనగరం (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు కేంద్రమాజీ మంత్రి అశోక్ గజపతిరాజు ఆదివారం మొక్కను బహూకరించారు. అశోక్ తన ప్రాంగణంలో నాటేందుకు తెచ్చిన మొక్కను ఎంపీకి అందజేశారు.

ఏనుగుల సంచారంతో భయాందోళన



వీవీఆర్‌పేట సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

వంగర: మండలంలోని వీవీఆర్ పేట, రాజులగుమ్మడ గ్రామాల పరిసర ప్రాంతాల్లో ఆదివారం ఏనుగుల గుంపు సంచరించింది. ఈ గుంపులో ఆరు ఏనుగులతో పాటు చిన్న ఏనుగు పిల్ల కూడా ఉంది. ఈ ఏనుగులు ఆయా గ్రామాల్లోని మొక్కజొన్న, వరి, కూరగాయ పంటలను నేలమట్టం చేశాయి. దీంతో ఆయా రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణమే తరలించాలి

రాజాం: నియోజకవర్గ పరిధిలోని వంగర మండలంలోగల వీవీఆర్ పేట, రాజులగుమ్మడ గ్రామాల్లో శనివారం నుంచి సంచరిస్తున్న ఏనుగుల గుంపును తక్షణమే తరలించేలా అటవీ శాఖాధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రెండు గ్రామాల్లో ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయని, దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వాటిని మండలం నుంచి తక్షణమే తరలించాలని కోరారు. విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తమై ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో కూడా శ్రీహరిపురం, దేవకివాడ, మద్దువలస, మగ్గూరు, సంగాం, ఓని అగ్రహారం గ్రామాల్లో కూడా పంటలను నాసనం చేశాయని ప్రస్తుతం ఆ పరిస్థితి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోండ్రు ఆదేశించారు. ఈ విషయంపై అటవీ శాఖ ఉన్నతాధికారులుకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

సర్పంచ్‌లకు గౌరవం పెరిగింది

రాజాం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పంచాయతీ సర్పంచ్‌లకు గౌరవ పెరిగిందని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వంగా వెంకటరావు అన్నారు. రాజాంలో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ హయాంలో స్వాతంత్ర దినోత్సవ నిర్వహణకు జగన్మోహన్ రెడ్డి సర్పంచ్‌లను రూ.100 ఇచ్చేవారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.10వేలకు పెంచడం హర్షణీయం అన్నారు. ఇటీవల పంచాయతీ వ్యవస్థాపక అధ్యక్షుడు వైవీవీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో సర్పంచ్‌ల సమస్యలపై పంచాయతీరాజ్ శాఖామంత్రి కె.పవన్‌కల్యాణ్‌కి వినతిపత్రం అందజేశామని చెప్పారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించి పంచాయతీలకు రావాల్సిన నిధులు విడతలుగా విడుదల చేయడానికి అంగీకరించారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు చీడి రమణ, ఎం.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి



ఆనంద్‌కుమార్‌తో మాట్లాడుతున్న షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు

నెల్లిమర్ల: నెల్లిమర్లలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషిచేస్తానని, ఈ విషయాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి దృష్టికి తీసుకువెళ్తానని టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అన్నారు. నెల్లిమర్లలోని షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ తరపున పలువురు క్రీడాకారులు ఆదివారం ఆనంద్‌కుమార్‌ను ఆయన స్వగృహంలో కలిసి, సమస్యలను విన్నవించారు. ఎలాంటి సదుపాయాలు లేకపోయినప్పటికీ పలువురు క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించారని తెలిపారు. ఇండోర్ స్టేడియం ఏర్పాటుచేస్తే మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు. ఇందుకు ఆనంద్‌కుమార్ స్పందించి ఇండోర్ స్టేడియం విషయాన్ని ఎమ్మెల్యే దృష్టిలో పెట్టి, మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పైడిరాజు, వీఎంకే లక్ష్మణరావు, పంచాది కిరణ్, లెంక శ్రీను, జయప్రకాష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి నియోజకవర్గ సమస్యలు



సమస్యలు వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం: విమానాశ్రయ నిర్మాణ పనుల పరిశీలనకు ఆదివారం భోగాపురం వచ్చిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజుకు టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు పలు సమస్యలను వివరించారు. నియోజకవర్గ సమస్యలు, విమానాశ్రయ ఏర్పాటులో గృహాలు ఉండి ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ రాకపోవడం, తదితర సమస్యలపై వివరించారు. కర్రోతు సత్యనారాయణ, కంది చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

క్వారీ అనుమతులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భోగాపురం: రామచంద్రపేట గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న నూతన క్వారీ అనుమతులు రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భోగాపురంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్వారీ ఇక్కడ నిర్వహించొద్దు అంటూ ప్రజా వేదికలో అందరూ మొర పెట్టుకున్నా దౌర్జన్యంగా క్వారీ నిర్వహించడం దారుణంగా ఉందన్నారు. ప్రజలు క్వారీ పనులు అడ్డుకుంటారని గ్రహించి వారిని భయాందోళనకు గురిచేసి పోలీస్ ప్రహరీలో క్వారీ నిర్వహించడం ఘోరంగా ఉందన్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా పనులు చేయడం అభివృద్ధి అనిపించుకుంటుందా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా క్వారీ నిలుపుదల చేయాలని లేదంటే మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అందరం ఏకతాటిపై నిలబడి పోరాటం చేసి క్వారీని అడ్డుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యనిర్వాహణ సభ్యులు టీవీ రమణ, డివిజన్ నాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలపై కలెక్టర్ ఆరా

మెంటాడ: మండలంలోని నివాసయోగ్యం కానిచోట్ల జగనన్న కాలనీలు, పది గ్రామాల ఇళ్ల పట్టాల రద్దు, పెండింగ్‌లో ఉన్న బిల్లుల విషయంపై కలెక్టర్ అంబేడ్కర్ సంబంధిత అధికారులను ఆరా తీశారని హౌసింగ్ ఏఈ డేవిడ్ ఆదివారం తెలిపారు. మండలంలోని జగనన్న కాలనీల దుస్థితి, పది గ్రామాల ఇళ్ల పట్టాలు రద్దు చేసిన వైనం, కొంతమంది బిల్లులు పెండింగు ఉన్న విషయంపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 7న 'ఇళ్లు లేదు.. బిల్లు లేదు' శీర్షికతో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై, కలెక్టర్ అంబేడ్కర్ స్పందించి సంబంధిత శాఖ ఉన్నతాధికారులను వివరణ కోరినట్టు తెలిసింది. ఈనేపథ్యంలో మండలంలోని పది గ్రామాలకు చెందిన సుమారు 600 ఇళ్ల రద్దుపై తక్షణమే నివేదిక ఇవ్వాలని ఉన్నతాధికారుల నుంచి స్థానిక హౌసింగ్, రెవెన్యూ అధికారులకు ఆదేశాలు వచ్చాయని హౌసింగ్ ఏఈ డేవిడ్ తెలిపారు.

వసతిగృహ సదుపాయాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న కన్నంనాయుడు

నెల్లిమర్ల: ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ వసతిగృహ సదుపాయాలను విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని మొయిద విజయరాంపురం బీసీ బాలుర వసతిగృహం సంక్షేమ అధికారి పతివాడ కన్నంనాయుడు అన్నారు. ఆ వసతి గృహంలో ఆదివారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వసతిగృహాల్లో మంచి పౌష్టికాహారంతో పాటు వసతి సదుపాయం ఉంటుందని చెప్పారు. విద్యా ప్రమాణాల స్థాయి పెంపునకు ప్రత్యేక దృష్టి కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయుడు ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

సేవే పరమావధిగా..

- ముందుకు సాగుతున్న జిల్లా యువత
- కొత్తకొత్త ఆవిష్కరణలతో ఆదర్శంగా నిలుస్తున్న వైనం
- నేడు అంతర్జాతీయ యువజన దినోత్సవం

సేవే పరమావధిగా కొందరు.. కొత్తకొత్త ఆవిష్కరణలు చేస్తూ కొందరు.. ఇలా జిల్లాకు చెందిన పలువురు యువత ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా వీరి సేవలపై, ఆవిష్కరణలపై ప్రత్యేక కథనం.

ఆవిష్కరణలతో అబ్బురపరుస్తున్నాడు..

- ఉపయోగకరమైన పరికరాల రూపకల్పనలో సత్తాచాటుతున్న మెట్టవలస యువకుడు



బ్యాటరీతో నడిచే కారును రూపొందించిన శంకరరావు

బొబ్బిలి: బొబ్బిలి మండలం మెట్టవలస గ్రామానికి చెందిన ఉంగట్ల శంకరరావు అనే యువకుడు తన మెదుడుకు పదును పెట్టి ఎన్నో పరికరాలను ఆవిష్కరిస్తున్నాడు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్ ట్రేడ్‌లో శిక్షణ పొందిన శంకరరావు.. ఇంజినీరింగ్ పట్టా తీసుకున్నవారికి ఏమాత్రం తీసిపోని విధంగా పలు ఆవిష్కరణలతో అందరినీ అబ్బురపరుస్తున్నాడు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ యువకుడిపై ప్రత్యేక కథనం.

శంకరరావు రూపొందించిన పరికరాలు..



బ్యాటరీతో నడిచే సైకిల్



భూమిని దున్నే పరికరం

- పాత ఇనుప సామగ్రి, వినియోగంలోలేని పరికరాలతో రెండు నెలల పాటు శ్రమించి రూ.50 వేలు ఖర్చుచేసి బ్యాటరీతో నడిచే కారును రూపొందించాడు. గంట పాటు బ్యాటరీని చార్జింగ్ చేస్తే 30 కిలోమీటర్ల దూరం ప్రయాణించేలా దానిని తయారుచేశాడు.
- పాతసైకిల్‌కు 24 వాల్టుల బ్యాటరీని, దానికి సరిపడా మోటారును అమర్చాడు. ఆ బ్యాటరీని 4 గంటల పాటు చార్జింగ్ చేస్తే 35 కిలోమీటర్ల స్పీడుతో 50 కిలోమీటర్లు ప్రయాణ సామర్థ్యం కలిగిన బ్యాటరీ సైకిల్‌ను రూపొందించాడు.
- భవన నిర్మాణ కార్మికుల కోసం కారుచౌకయిన సరుకు రవాణా పరికరాన్ని కనుగొన్నాడు. కేవలం వెయ్యి రూపాయలు వెచ్చించి పాత ఇనుప సామగ్రితో అల్యూమినియం ట్రాక్‌కు మోటారును అమర్చాడు. భవన కార్మికులకు పైఅంతస్తులకు నిర్మాణ సామగ్రిని తీసుకెళ్లేందుకు వీలుగా ఈ పరికరాన్ని రూపొందించాడు.
- రైతులకు వినియోగమయ్యే గాలి పంకా, దుక్కి యంత్రాలను తయారు చేశాడు.
- సైకిల్‌పై పెద్దసైజు బరువులను మోసుకెళ్లే విధంగా మోటార్లను అమర్చాడు.
- దివ్యాంగుల కోసం నాలుగు చక్రాలతో కూడిన వీల్‌చైర్‌ను మోటారు సహాయంతో రూపొందించాడు.

ఎందరికో 'చైతన్య' స్ఫూర్తి



చైతన్య కుమార్

రాజాం రూరల్: నేత్రదానం, అవయవదానంపై అవగాహన సదస్సులు.. లక్షా 23 వేలమంది నుంచి రక్తం సేకరణ.. చనిపోయిన 150 మంది నుంచి కార్నియా సేకరణ.. ఇలా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాడు పెంకి చైతన్యకుమార్. యువజన దినోత్సవం సందర్భంగా జాతీయ యువజన అవార్డు గ్రహీత అయిన చైతన్యకుమార్‌పై ప్రత్యేక కథనం.

ప్రాథమిక స్థాయి నుంచే..

వంగర మండలం కొప్పర కొత్తవలస గ్రామానికి చెందిన పెంకి చైతన్య కుమార్ ఐదో తరగతి చదువుతున్న రోజుల్లో ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో ప్రారంభించిన అక్షరక్రాంతి కార్యక్రమంలో భాగంగా యువజనులకు సంతకాలు నేర్పడంతో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడు. 2004లో సునామీ సమయంలో రెడ్‌క్రాస్‌లో చేరి 2005 నుంచి రక్తదాన శిబిరాల నిర్వహణ ప్రారంభించి నేటివరకూ లక్షా 23వేల మంది నుంచి రక్తాన్ని సేకరించి.. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ద్వారా క్షతగాత్రులు, గర్భిణులు, ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి రక్తం అందించడంలో ప్రధానపాత్ర పోషించాడు. కాకినాడలో తెలుగుపండిట్ శిక్షణ పొందుతున్న సమయంలో, జిల్లెలమూడి అమ్మ పాఠశాలలో బీఏ భాషాప్రవీణ చేస్తున్న సమయంలో ఆయా ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించాడు.

నేత్ర, అవయవదానంపై కృషి..

నేత్రదానంపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలిగించే ప్రక్రియలో భాగంగా శ్రీకాకుళంలోని మగటపల్లి కళ్యాణ్ నేత్రసేకరణ కేంద్రం ఆధ్వర్యంలో మరణించిన 120 మంది నుంచి కార్నియాలు సేకరించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. 10 వేల మందికి పైగా వ్యక్తుల నుంచి నేత్రదాన అంగీకార పత్రాలను సేకరించి నేత్రసేకరణ కేంద్రానికి అందజేశాడు. సుమారు 25వేలమందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించిన చైతన్య అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచాడు. అలాగే అవయవానంపైనా ప్రజలను అప్రమత్తం చేశాడు. సుమారు వంద మంది నుంచి అవయవదాన అంగీకార పత్రాలను సేకరించాడు.

కరోనా బాధితులకు సాయం..

కరోనా సమయంలో రాజాం ప్రాంతం నుంచి 150 మంది నుంచి ప్లాస్మా సేకరించి కరోనా బాధితులకు అందించడంలో ప్రధాన పాత్ర పోషించాడు. అలాగే రాజాం ప్రాంతంలో కరోనాతో మృతిచెందిన వారికి అంతిమ సంస్కారాలు నిర్వహించి చివరి మజిలీకి చేయూత అందించాడు.



ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ చేతులమీదుగా జాతీయ యువజన పురస్కారం అందుకుంటున్న దృశ్యం(ఫైల్)

పతకాల వెల్లువ..

ఇప్పటివరకూ ఒక బంగారు పతకంతో పాటు 17 బంగారు పూత పతకాలను చైతన్య పొందాడు. రాష్ట్ర గవర్నర్లు ఎన్డీ తివారీ, ఈఎస్ఎల్ నరసింహన్, విశ్వభూషణ్ హరిచందన్, సుశీల్‌కుమార్ షిండే, రామేశ్వరనాద్ ఠాకూర్ తదితర గవర్నర్లు చైతన్యకు బంగారు పతకాలు అందజేశారు. 2009లో పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ యువజన పురస్కారాన్ని దేశ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ చేతులమీదుగా తీసుకున్నాడు.

భారత్ ప్రతినిధిగా..



ఎంఎస్ స్వామినాథన్ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న చైతన్య(ఫైల్)

మలేషియాలోని కౌలాలంపూర్‌లో 2009లో నిర్వహించిన కామన్‌వెల్త్ యువజన సదస్సులో భారత ప్రతినిధిగా చైతన్య రాజాం నుంచి పాల్గొన్నాడు. మలేషియా సెక్రటరీ జనరల్ నుంచి ప్రసంశాపత్రాన్ని అందుకున్నాడు. సామాజిక సేవకు సంబంధించి భారత హరిత విప్లవ పితామహుడు ఎంఎస్ స్వామినాథన్ చేతులమీదుగా 2012లో చెన్నైలోని స్వామినాథన్ ఫౌండేషన్ కార్యాలయంలో పురస్కారం అందుకున్నాడు.

పేదలకు సహకారం..



బెటాలియన్‌లో మొక్క నాటుతున్న కుమారి



బొబ్బిలి/రూరల్: ఆమె ఎంతోమందికి స్ఫూర్తిదాయకం.. పేదింటిలో పుట్టి, అస్సాం రైఫిల్స్ ఉమెన్‌గా ఉద్యోగం సాధించి, తన గ్రామానికి చెందిన పేదలకు తనవంతు సహకారం అందిస్తోంది. పేద యువతీ యువకుల చదువుకు ప్రోత్సాహం అందిస్తోంది. ఆమె బొబ్బిలి మండలం, కోమటిపల్లి గ్రామానికి చెందిన రంభ కుమారి. ఆమె తన చిన్నతనంలోనే తండ్రి సత్యంను కోల్పోయింది. తల్లి పార్వతి కాయకష్టం చేసుకుని తన ఒక్కగానొక్క కూతురిని చదివించుకుంది. అమ్మ పడుతున్న కష్టాలను అనునిత్యం నెమరువేసుకుంటే ఎలాగైనా సరే ప్రయోజకు రాలిని కావాలనుకున్న కుమారి.. 2021 ఏప్రిల్‌లో నాగాలాండ్‌లో అస్సాం రైఫిల్స్ ఉమెన్‌గా ఉద్యోగం సాధించింది. నాటి నుంచి తన తల్లిని సాకడమే కాక, గ్రామానికి చెందిన పేదలకు తన వంతు సహకారం అందిస్తోంది. తాను పడ్డ కష్టం ఇంకే పేద యువతీ యువకులు పడకూడదని వారి చదువు, ఇతర అవసరాలకు ప్రోత్సాహం అందిస్తోంది.

రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

గంట్యాడ: జగన్‌కు ఒకే ఒక్క చాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రం సర్వ నాశనం అయ్యిందని రాష్ట్ర సెర్ప్, ఎన్ఆర్ఐ, చిన్నతరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు. ఆదివారం గంట్యాడ గ్రామానికి చెందిన పలువురు మంత్రి సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పాలకులు చేసిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావని, మద్యం కుంభకోణం చూస్తే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. ఈ పరిస్థితి నుంచి రాష్ట్రాన్ని తిరిగి బాగు చేయాలని సీఎం చంద్రబాబు చూస్తున్నారని, అందుకు ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఉద్యోగుల బదిలీలపై స్థానిక నాయకులు అడగవద్దని, సమయం చూసుకుని ప్రభుత్వం జీవో ఇస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండపల్లి కొండలరావు, టీడీపీ మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్‌నాయుడు, పార్టీ మండల నాయకులు అల్లు విజయకుమార్, రంధి చినరామునాయుడు, జి.శ్రీనివాస్, బూడి అప్పలనాయుడు, రఘమండ లక్ష్మి పాల్గొన్నారు.

ఎస్.కోట రూరల్ సీఐగా రవికుమార్

వేపాడ: ఎస్.కోట రూరల్ సీఐగా కె.రవికుమార్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ సీఐగా బాధ్యతలు నిర్వహించే హెచ్.ఉపేంద్ర రాజాం పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. రవికుమార్ పార్వతీపురం రూరల్ సీఐగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. తన స్టేషన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల మీద దృష్టి సారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

వరిసాగులో డ్రమ్‌సీడర్ పద్ధతి మేలు

నెల్లిమర్ల: వరిసాగులో డ్రమ్‌సీడర్ పద్ధతి చేపడితే ఖర్చు తగ్గడంతో పాటు దిగుబడి పెరుగుతుందని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ రెడ్డి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం తంగుడుబిల్లి గ్రామంలో వరిసాగులో డ్రమ్‌సీడింగ్ పద్ధతి ఉపయోగాలను రైతులకు వివరించారు. ఎంపీటీసీ చందక చిన్నంనాయుడు, మాధవరావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి చంద్రబాబు

- ఎమ్మెల్యే కళావెంకటరావు



లాకుల వద్ద పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

చీపురుపల్లి: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు అన్నారు. మండలం లోని నాగంపేట కుడి ప్రధాన కాలువకు ఆయన ఆదివారం తోటపల్లి నీటిని విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరైతు సుభిక్షంగా ఉండాలన్నదే చంద్రబాబు ధ్యేయమన్నారు. రైతులంతా నీటిని సక్రమంగా వినియోగించుకుని ఖరీఫ్‌లో పంటను సాగు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

జామి: చింతాడ గ్రామంలో మాజీ సర్పంచ్ కెంగం పద్మ, సీనియర్ నేత దండునాయుడుతో పాటు పలువురు వార్డు మెంబర్లు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆధ్వర్యంలో ఆదివారం సుమారు వంద కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యేతో పాటు టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు వీరికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బండారు పెదబాబు, టీడీపీ మండల కార్యదర్శి వర్రి రమణ, పార్టీ నాయకులు మాకవరపు శ్రీలక్ష్మి, పోలిపర్తి స్వామినాయుడు, ద్వారపూడి బాలాజీ, ఎర్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరినవారితో ఎమ్మెల్యే లలితకుమారి

ఉత్తమ గేయ రచయితగా అజయ్



దత్తిరాజేరు: మండలంలోని పోరి గ్రామానికి చెందిన సరయవలస అజయ్‌కుమార్ ఉత్తమ గేయ రచయితగా అవార్డు పొందారు. విశాఖపట్టణంలోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో శనివారం రాత్రి జరిగిన స్టార్ సినీ అవార్డ్స్ కార్యక్రమంలో భాగంగా కౌసల్య తనయ రాఘవ సినిమాలోని హేరామ హేరామ పాటకు ఈ అవార్డు లభించింది. ఆయనకు అవార్డు రావడం పట్ల అజయ్ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా అజయ్ మాట్లాడుతూ తనకు అవార్డు రావడం పట్ల చాలా ఆనందంగా ఉందని, తనకు అవకాశం కల్పించిన దర్శకుడు స్వామి పట్నాయక్, నిర్మాత అడపా రత్నాకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

15న ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాజాం: వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్థానిక గెరంట్ల నర్సింగ్‌హోంలో ఈనెల 15వ తేదీన ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని వికాస తరంగణి కేంద్ర కమిటీ సభ్యుడు టీటీవీ రమణమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కెంబూరి కుటుంబానికి శంకరరావు పరామర్శ

చీపురుపల్లి: ఇటీవల మృతిచెందిన మాజీ ఎంపీ కెంబూరి రామ్మోహనరావు కుటుంబాన్ని రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్ చైర్మన్ డా.డీవీజీ శంకరరావు పరామర్శించారు. ఆదివారం చీపురుపల్లి వచ్చిన ఆయన పట్టణంలోని కెంబూరి నివాసానికి వెళ్లారు. కెంబూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే కిమిడి గణపతిరావు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత

- మిగతా ఉద్యోగులపై పనిభారం
- నిర్ణీత గడువులోగా పూర్తికాని పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు



గంట్యాడ తహసీల్దార్ కార్యాలయం

గంట్యాడ: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సిబ్బంది కొరత ఏర్పడింది. దీంతో మిగిలిన ఉద్యోగులపై పని భారం పెరుగుతోంది. మరోవైపు నిర్ణీత గడువులోగా పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ రాజును విజయనగరం తహసీల్దార్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో కొత్తవారిని నియమించలేదు. అలాగే ఇక్కడ ఉన్న జూనియర్ అసిస్టెంట్ విజయనగరం ఆర్డీవో కార్యాలయానికి డెప్యూటేషన్‌పై బదిలీ చేశారు. దీంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లలో ఒకరు జేసీ కార్యాలయానికి డెప్యూటేషన్‌పై వెళ్లారు. దీంతో ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఇక్కడ నుంచి డెప్యూటేషన్‌పై వేరే చోటకు బదిలీ చేసిన సమయంలో ఆ స్థానంలో మరొకరిని నియమించకపోవడంతో సిబ్బంది కొరత వచ్చింది. ఈ పరిస్థితిలో మిగిలిన సిబ్బందికి పనిభారం పెరుగుతోంది. వెంటనే ఈ సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు కోరుతాం

కార్యాలయంలోని సిబ్బంది సమస్య ఉంది. సీనియర్ అసిస్టెంట్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానంలో కొత్తవారిని ఇంకా నియమించలేదు. జూనియర్ అసిస్టెంట్ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఒక డీటీ పోస్టును డెప్యూటేషన్‌పై జేసీ కార్యాలయానికి వేశారు. సిబ్బంది కొరత సమస్యను పరిష్కరించాలని ఉన్నతాధికారులను కోరుతాం.

- నీలకంఠేశ్వరరెడ్డి, తహసీల్దార్, గంట్యాడ